




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :68 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 13 నవంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :68 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 13 NOVEMBER 2024 PRICE : 5/- RS

*Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur*


## 30 రోజుల్లోనే రిలయన్స్‌తో ఒప్పందం కుదరడం చారిత్రాత్మకం

- ఏపీ ప్రభుత్వం, రిలయన్స్ ఎనర్జీ మధ్య కుదిరిన ఒప్పందం
- బయో ఇంధన ప్రాజెక్టులో రూ.65 వేల కోట్ల పెట్టుబడులకు రిలయన్స్ సిద్ధం
- రిలయన్స్ నిర్ణయం ఏపీ ప్రజలు, పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం పెంచిందన్న లోకేశ్
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు రిలయన్స్ పెట్టుబడులే నిదర్శనమని వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ పారిశ్రామిక రంగంలో నేడు కీలక ముందడుగు పడింది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో బయో ఇంధన ప్రాజెక్టుకు సంబంధించి రిలయన్స్ ప్రతినిధులు, ఏపీ ప్రభుత్వ ఉన్నతాధికారుల నడుమ అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా

వివరాలు 2లో..

# మీరేం మాట్లాడుతున్నారో నేను గమనిస్తున్నా



## ఎమ్మెల్యేలకు ట్రైనింగ్ క్లాస్ లో చంద్రబాబు వ్యాఖ్యలు

ఎమ్మెల్యేలతో తన అనుభవాలు పంచుకున్న సీఎం చంద్రబాబు

నూతన, రెండోసారి ఎన్నికైన ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు

విలువైన సూచనలు చేసిన చంద్రబాబు

ఎమ్మెల్యేల్లో సబ్జెక్టు నేర్చుకోవాలనే ఆసక్తి తగ్గుతోందని వెల్లడి

- నిన్న ఏపీ అసెంబ్లీ సమావేశాలకు విరామం
- ఎమ్మెల్యేలకు బడ్జెట్ పై అవగాహన కార్యక్రమం
- తెలుగు రాష్ట్రాల్లో తానే సీనియర్ ఎమ్మెల్యేనన్న చంద్రబాబు
- ప్రతి రోజూ కొత్త విషయాలు నేర్చుకుంటానని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**నిన్న ఏపీ అసెంబ్లీ సమావేశాలకు విరామం కావడంతో ఎమ్మెల్యేలకు బడ్జెట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎమ్మెల్యేల శిక్షణ తరగతులకు సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పార్లమెంటరీ రీసెర్చ్ స్టడీస్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తన రాజకీయ జీవితంలోని అనుభవాలను ఎమ్మెల్యేలతో పంచుకున్నారు. రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడం, విలువలకు కట్టుబడి ఉండడం, ప్రజా ఉపయోగ రాజకీయాలు చేయడం వంటి అంశాలపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు రాష్ట్ర సంపదగా తయారు కావాలని అభిలషించారు. ప్రజా సమస్యల వేదికగా అసెంబ్లీని సద్వినియోగం

వివరాలు 2లో..



## వైసీపీ సోషల్ మీడియా గుట్టు బయటపెట్టిన వర్రా!



- వర్రా రవీంద్రారెడ్డి రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు
- సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో వర్రా రవీంద్రారెడ్డి అరెస్ట్
- 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి
- ఆ ముగ్గురే కీలకమని రిమాండ్ రిపోర్టులో వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితలపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. వైసీపీ సోషల్ మీడియాలో సజ్జల భార్గవరెడ్డి, అర్జున్ రెడ్డి, సుమా రెడ్డి

వివరాలు 2లో..

## సజ్జల భార్గవరెడ్డి అరెస్ట్ కు రంగం సిద్ధం... లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు

- నవంబరు 8న వర్రా, భార్గవరెడ్డి, అర్జున్ రెడ్డిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు
- భార్గవరెడ్డి విదేశాలకు పారిపోతాడన్న అనుమానం
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి వాంగ్మూలం నేపథ్యంలో, ఏపీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వైసీపీ సోషల్ మీడియా ఇన్చార్జి సజ్జల భార్గవరెడ్డి, వైసీపీ సోషల్ మీడియాలో కీలక వ్యక్తి, జగన్ కు దగ్గరి బంధువు

వివరాలు 2లో..

## ప్రియాంక గాంధీపై ఈసీకి ఫిర్యాదు చేసిన ఎల్‌డీఎఫ్



- కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారన్న ఎల్‌డీఎఫ్
- మతపరమైన ప్రదేశాలను దుర్వినియోగం చేశారని ఫిర్యాదు
- ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఈసీకి సమర్పించిన ఎల్‌డీఎఫ్

**పెన్ పవర్ డెస్క్:**వయనాడ్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకగాంధీ వాద్రాపై ఎల్‌డీఎఫ్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. వయనాడ్ లోక్ సభ ఎన్నికల ప్రచారం సమయంలో ఆమె మతపరమైన ప్రదేశాలను దుర్వినియోగం చేశారని ఎల్‌డీఎఫ్ ఫిర్యాదు చేసింది. తద్వారా కాంగ్రెస్

వివరాలు 2లో..

## సోషల్ మీడియాలో నాపై ప్రచారాన్ని జగన్ ప్రోత్సహించారు

- సోషల్ మీడియా పోస్టుల అంశంపై షర్మిల స్పందన
- జగన్ వద్దు అని చెప్పి ఉంటే తప్పుడు ప్రచారం ఆగేదని వెల్లడి
- వైసీపీ సోషల్ మీడియా ఓ సైతాన్ ఆర్మీలా తయారైందని విమర్శలు
- ఇప్పటివరకు పట్టుబడింది విషనాగులేనని వ్యాఖ్యలు
- విషనాగులతో పాటు అనకొండను కూడా పట్టుకోవాలని సూచన



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. సోషల్ మీడియాలో తాను కూడా బాధితురాలినేనని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టుల ద్వారా తనపై ప్రచారం వెనుక ఉన్నది జగనే అని స్పష్టం చేశారు. నాపై దుష్ప్రచారం జరుగుతుంటే ఆయన ఆపలేదు... దానర్థం ఏమిటి? ఆ అసభ్యకర ప్రచారాన్ని ఒకరకంగా ఆయన ప్రోత్సహించినట్టే కదా! అని షర్మిల వ్యాఖ్యానించారు.

వివరాలు 2లో..

## ఏపీలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా

- తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జనవరి 5న గ్రూప్-2 మెయిన్స్
- పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు సమయం సరిపోదన్న అభ్యర్థులు
- ఏపీపీఎస్సీకి విజ్ఞప్తి చేసిన పలువురు ఎమ్మెల్సీలు
- అందరి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ఏపీపీఎస్సీ
- ఫిబ్రవరి 23కి గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా




**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా పడ్డాయి. వచ్చే ఏడాది జనవరి 5న జరగాల్సిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఫిబ్రవరి 23కి వాయిదా వేశారు. పరీక్ష తేదీ ప్రకటించినప్పటి నుంచి పరీక్ష నిర్వహించే తేదీ మధ్య కనీసం 90 రోజుల పాటు సమయం ఉండాలి. అయితే, ఈసారి ఆ సమయం 60 రోజులే ఉండడంతో, పరీక్షకు సన్నద్ధం కాలేమన్న ఆందోళన గ్రూప్-2 అభ్యర్థుల్లో వ్యక్తమైంది. దాంతో వారు ఏపీపీఎస్సీ చైర్ పర్సన్ అనురాధను కలిసి, గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల తేదీని మార్చాలని, పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు తమకు మరికొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఉత్తరాంధ్రకు చెందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ

వివరాలు 2లో..

## సుప్రీంలో జగన్ అక్రమాస్తుల కేసు మరో ధర్మాసనానికి

- 'నాట్ బిఫోర్ మి' చెప్పిన జస్టిస్ సంజయ్ కుమార్
- విచారణను మరో ధర్మాసనానికి మార్చిన సీజేఐ
- ఎంపీ రఘురామ దాఖలు చేసిన పిటిషన్లు రెండూ జస్టిస్ ఓకా బెంచ్ కు మార్పు



**పెన్ పవర్ డెస్క్:**సుప్రీంకోర్టులో వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీజేఐ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసు విచారణను మరో ధర్మాసనానికి అప్పగించింది. ఇప్పటి వరకు ఈ కేసులో వాదనలు విన్న సీజేఐ బెంచ్.. తాజాగా మరో బెంచ్ ముందుకు పంపిస్తూ నిర్ణయం తీసుకుంది. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ పై బయట ఉన్న సంగతి తెలిసిందే. ఈ బెయిల్ ను రద్దు చేయాలంటూ రఘురామకృష్ణరాజు సుప్రీంకోర్టులో గతంలోనే పిటిషన్ దాఖలు చేశారు.

వివరాలు 2లో..

## కేసుల మీద కాదు... వీటిపై దృష్టిపెట్టండి

### ఈ వార్త చదువుతుంటేనే హృదయం ద్రవిస్తోంది

- మరోసారి కూటమి ప్రభుత్వంపై 'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి విమర్శలు
- ఎన్‌టీఆర్ జల్లా పెనుగంచిప్రోలులో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ ట్వీట్
- ఏడాది బాలుడిని కరిచి చంపేసిన కుక్కలు
- ఇలాంటి వాటిపై దృష్టిపెట్టాలంటూ కూటమి ప్రభుత్వానికి అంబటి హితవు



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి కూటమి ప్రభుత్వంపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా విమర్శలు గుప్పించారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులు, కేసుల మీద కాకుండా రాష్ట్రంలో జరిగిన ఇలాంటి ఘటనపై దృష్టిసారించాలంటూ ఎన్‌టీఆర్ జల్లా పెనుగంచిప్రోలులో జరిగిన ఘటన తాలూకు పేపర్ క్లిప్‌ను పంచుకున్నారు. ఈ ఘటనలో ఏడాది బాలుడిని కుక్కలు కరిచి చంపేశాయి. ఈ ఘటనపై అంబటి స్పందించారు. "వాడి మీద కేసు పెడదాం... వీళ్ళని బొక్కలో వేద్దాం... మొత్తాన్ని చితక్కొడదాం... అనే వాటి మీద నుంచి దృష్టి ఇలాంటి ఘోరాల మీద పెట్టండి. ఈ వార్త చదువుతుంటేనే హృదయం ద్రవిస్తోంది" అని ఆయన ట్వీట్ చేశారు.

## మహారాష్ట్రలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం..



- ఎన్డీయే కూటమి కోసం ప్రచారం చేయనున్న ఏపీ డిప్యూటీ సీఎం
- బీజేపీ కూటమిని గెలిపించాలని మహారాష్ట్ర ఓటర్లను కోరనున్న పవన్
- తెలుగు వారు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ నెల 16, 17 తేదీల్లో ప్రచారం

వివరాలు 2లో..

## వికారాబాద్ కలెక్టర్‌పై దాడి కేసు... నిందితులకు రిమాండ్



- 55 మంది రైతులను సుదీర్ఘంగా విచారించిన పోలీసులు
- 39 మంది రైతులను విడుదల చేసిన పోలీసులు
- నిందితులకు వైద్యపరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

వివరాలు 2లో..

**పెన్ పవర్ డెస్క్:**వికారాబాద్ జిల్లా కలెక్టర్ మీద దాడి కేసులో నిందితులకు కోర్టు రి మాండ్ విధించింది. జిల్లాలోని లగచర్లలో నిన్న కలెక్టర్‌పై కొంత మంది రైతులు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ఫార్మా సిటీకి సంబంధించి ప్రజాభిప్రాయ

## ఎడిటర్ వ్యూ

# వలసల విధానంపై పిడుగేనా

అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఇంకా గద్దెనెక్కక ముందే.. శ్వేతసౌధంలోకి అడుగు పెట్టకముందే.. వలస విధానంలో సంచలనం చోటు చేసుకుంది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఈ ఏడాది జూన్‌లో 'కుటుంబాలను కలిపి ఉంచడం'(కీపింగ్ ఫ్యామిలీస్ టుగెదర్) అనే నూతన వలస విధానాన్ని తీసుకువచ్చారు. దీని ద్వారా అమెరికాలో నివసిస్తున్న విదేశీ పౌరులు తమ కుటుంబ సభ్యులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోయినా.. చట్టబద్ధత పొందే వీలు కల్పించారు. అయితే.. ఈ విధానాన్ని తాజాగా గతంలో డొనాల్డ్ ట్రంప్ నామినేటెడ్ చేసిన టెక్సా?సలోని జిల్లా జడ్జి జస్టిస్ జె. కాంప్‌బెల్ బార్కర్ నిలుపుదల చేశారు."ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఫెడరల్ ఏజెన్సీలకు చట్టబద్ధత లేదు" అని తీర్పు వెలువరించారు. దీంతో నూతన విధానానికి అర్హులైన సుమారు 5లక్షల మంది పౌరులపై పిడుగు పడినట్టయింది. ట్రంప్ అప్రతిహత విజయం దక్కించుకున్న కొన్ని గంటల్లోనే ఆయన నామినేట్ చేసిన జడ్జి తీర్పు వెలువరించడం చర్చకు దారితీసింది. అక్రమ వలస దారులను దేశం నుంచి పంపేస్తానని ఎన్నికల సమయంలో ట్రంప్ పదే పదే చెప్పిన విషయం తెలిసిందే. టెక్సాస్ కోర్టు తాజా తీర్పుపై 'అమెరికన్ ఫ్యామిలీస్ యునైటెడ్' సంఘం అధ్యక్షుడు ఆష్లే డీ అజెవెడో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీర్పు లక్షల మంది ఆశలను ఛిద్రం చేసిందన్నారు.మైగ్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ (తిరువనంతపురం) సర్వే ప్రకారం 2023లో కేరళ నుంచి విదేశాలకు ఉన్నత చదువులకోసం 2.5 లక్షల మంది విద్యార్థులు వలస వెళ్లారు. దేశం మొత్తం మీద విదేశాలకు వెళ్లిన మొత్తం విద్యార్థుల సంఖ్యలో కేరళ విద్యార్థుల సంఖ్యే 20% వరకు ఉంటోందని తేలింది. కేరళ నుంచి ఇంత భారీ ఎత్తున విద్యార్థులు వలస వెళ్లడానికి దారి తీసే పరిస్థితులు ఏమిటి? ఈ విధమైన పరిస్థితి కేరళ రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక అంశాలపై విపరీత ప్రభావం చూపిస్తుంది. ఏ దేశంలో ఉపాధికి, ఉద్యోగాలకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయో, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎక్కడ ప్రోత్సాహకర వాతావరణం ఉంటుందో అక్కడకు ప్రజలు వలస వెళ్లడం సహజం. అలాగే విద్యార్థుల ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు భారీ ఎత్తున అవకాశాలు ఉంటున్నందున విద్యార్థుల వలస విశేష సంఖ్యలో కొనసాగుతోంది.కేరళలో విద్యావంతులు ఎక్కువే. నిరుద్యోగమూ ఎక్కువే. ఉద్యోగాలను ఆశిస్తూ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజిల్లో 2023లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి సంఖ్య 29 లక్షలు దాటింది. వీరిలో ఎస్ఎస్ఎల్‌సి లేదా అంతకన్నా ఎక్కువ చదువుకున్న వారి సంఖ్య 23 లక్షల వరకు ఉంది. సాంకేతికంగా అర్హత కలిగిన వారు 3.5 లక్షలకు పైబడి ఉన్నారు. దీనికి తోడు యూనివర్శిటీల చదువులు పూర్తి చేసుకుని ఏటా లేబర్ మార్కెట్‌లోకి చేరుతున్న వారి సంఖ్య మరో లక్ష వరకు ఉంటోంది. మరోవైపు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న వారి సంఖ్య 20 లక్షలు దాటింది. అలాంటి గెస్ట్ వర్కర్లు ఏ పని చేయడానికైనా సిద్ధంగా ఉంటారు. కానీ నిరుద్యోగులైన విద్యావంతులు మాత్రం ఏపని అయినా చేయడానికి సిద్ధంగా ఉండరు. వీరు తమ సామాజిక హోదాకు తగ్గట్టు ఎక్కువ వేతనం అందించే సుస్థిరమైన ఉద్యోగాలను ఆకాంక్షిస్తుంటారు. అయితే అలాంటి ఉద్యోగాలు చాలా తక్కువగా ఉండటంతో నిరుద్యోగులు అలాగే ఉండిపోతున్నారు. మొత్తం మీద వలస విద్యార్థులు ముఖ్యంగా అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జర్మనీ, ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు వెళ్లడానికి ముందు వరుసలో ఉండడం పరిపాటి. ఈ దేశాల్లో ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీగా లభించే అవకాశాలు పుష్కలంగా ఉండడమే ఈ ఆకర్షణకు కారణం.కేరళలో ఇచ్చే వేతనం కన్నా అనేక రెట్లు వేతనం విదేశాల్లో ఇస్తున్నారు. ఉదాహరణకు అమెరికాలో పనిచేసే ఒక నర్సు నెలకు రూ. 4,00,000 వరకు సంపాదిస్తోంది. దీనికి తోడు విలాసవంతమైన నివాసం, కార్లు, అత్యంత ఆధునికమైన పరికరాల వినియోగం కేరళలో ఉండే తమ తల్లిదండ్రులకు అందేలా చేస్తోంది. విదేశాల్లో ఈ విధంగా సంపాదించే వేతనాల్లో కనీసం పదోవంతైనా కేరళలోని నర్సుకు దక్కడం లేదు. కలలోనైనా అలాంటి విలాస జీవనం ఊహించే అవకాశం కలగదు. నర్సులే కాదు, దాదాపు అన్ని కేటగిరీలకు చెందిన వర్కర్లు కేరళలో తమ వేతనాలతో అలాంటి విలాసవంత జీవితాన్ని కలగనడానికైనా అవకాశమే ఉండదు. వలస వెళ్లిన వారి కుటుంబాలు కేరళలో అత్యంత విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు. ఈ కుటుంబాల యువకులు, కుర్రాళ్లు సాధారణంగా తమకు తాము విలాసవంతమైన జీవితాన్నే కోరుకుంటారు. అలాంటి బంగారు స్వప్నాలు వారిని విదేశాలకు వెళ్లి చదువుకోడానికి, అక్కడే ఉద్యోగాలు చేయడానికి దోహదం చేస్తున్నాయి. అయితే చాలా మందికి విదేశాలకు వలస వెళ్లడం పూలబాట కాకపోవచ్చు. అమెరికా ఇటీవల తీసుకున్న నిర్ణయం భారతీయ కుటుంబాలకు చెందిన వేలాదిమంది పిల్లల భవిష్యత్తు త్రిశంకు స్వర్గంగా ఉంటోంది.చిన్నవయసులో తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వచ్చినవారు అక్కడే పెరిగి, చదువులు పూర్తి చేసుకుని తమకు 21 ఏళ్లు రాగానే అమెరికా ప్రభుత్వం వారిని స్వదేశానికి దయచేయండి అని చెప్పడం వివాదాస్పదంగా తయారైంది. ఇక తెలుగు రాష్ట్రాల విద్యార్థుల పరిస్థితిని పరిశీలిస్తే అమెరికాలో భారతీయ విద్యార్థుల్లో 12.5 శాతం మంది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన తెలుగువారే ఉన్నారు. అందువల్ల ఎవరైనా తెలుగు రాష్ట్రాల నుంచి కొత్తగా అమెరికాకు వస్తే తమ చుట్టూ తెలుగువారే ఎక్కువగా కనిపిస్తుండటంతో వారు విదేశాల్లో ఉన్నామన్న భావన కన్నా స్వంత రాష్ట్రాల్లోనే ఉన్నామన్న అనుభూతి కలుగుతోంది. అమెరికాలో తెలుగు మాట్లాడే జనాభా 2016లో 3,20,000 నుండి 2024 నాటికి 1.23 మిలియన్‌కు పెరిగింది. అమెరికా సెన్సస్ బ్యూరో డేటా ఆధారంగా కాలిఫోర్నియాలో అత్యధికంగా తెలుగు మాట్లాడే జనాభా దాదాపు 2,00,000 వరకు ఉంది. ఇప్పుడు అమెరికాలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో 11 వ స్థానంలో తెలుగు ఉంది.

# 30 రోజుల్లోనే రిలయన్స్‌తో ఒప్పందం కుదరడం చారిత్రాత్మకం

- మొదటి పేజీ తరువాయి
రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఐదు నెలల్లోనే రిలయన్స్ ఎనర్జీ సంస్థ బయో ఇంధన ప్రాజెక్టులో రూ.65 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందని అన్నారు.
తాను ముంబాయిలో రిలయన్స్ చైర్మన్ ముఖేశ్ అంబానీ, రిలయన్స్ ఎనర్జీ అధినేత అనంత్ అంబానీతో చర్చలు జరిపిన 30 రోజుల్లోనే ఒప్పందం కుదరడం చారిత్రాత్మక ఘట్టమని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలకు ఈ ఒప్పందం ఊతమిస్తుందని చెప్పారు. ఇప్పటివరకు యూపీలోని బారాబంకీ బయోఫ్యూయల్ ప్రాజెక్టు వేగవంతంగా అమలైందని, రాష్ట్రంలో రిలయన్స్ ఏర్పాటు చేయబోయే ప్రాజెక్టు ఆ రికార్డును బద్దలు కొడుతుందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. డిసెంబర్ 28న ప్రకాశం జిల్లా కనిగిరిలో తొలి బయో ఇంధన ప్రాజెక్టుకు శంకుస్థాపన జరుగుతుందని, రాబోయే మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 500 ప్లాంట్ల ఏర్పాటు పూర్తిచేస్తారని చెప్పారు. తొలిదశ ప్రాజెక్టు వచ్చే ఏడాది డిసెంబర్ 28 నాటికి (ఏడాదిలో) పూర్తిచేస్తామని రిలయన్స్ ఎనర్జీ ఏపీ ప్రతినిధి ప్రసాద్ తెలిపారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ... రిలయన్స్ బయో ఇంధన ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం తరపున అవసరమైన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.రిలయన్స్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ఏపీ ప్రజలతోపాటు పారిశ్రామికవేత్తల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న తమ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు అవుతున్నందుకు రిలయన్స్ అధినేతలు ముఖేశ్ అంబానీ, అనంత్ అంబానీలకు మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

# సజ్జల భార్గవరెడ్డి అరెస్ట్ కు రంగం సిద్ధం... లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు

- మొదటి పేజీ తరువాయి
అర్జున్ రెడ్డిల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇటీవలే వీరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో, సజ్జల భార్గవరెడ్డి విదేశాలకు వెళ్లకుండా అడ్డుకునేందుకు కడప పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. నవంబరు 8వ తేదీన వర్రా రవీంద్రారెడ్డి, సజ్జల భార్గవరెడ్డి, అర్జున్ రెడ్డిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వైఎస్సార్ జిల్లాకు చెందిన హరి అనే దళితుడి ఫిర్యాదు ఆధారంగా నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదైంది. సోషల్ మీడియా పోస్టులపై ప్రశ్నించినందుకు తనను కులం పేరుతో దూషించారని హరి తన ఫిర్యాదులో ఆరోపించాడు.
గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన సజ్జల రామకృష్ణారెడ్డి తనయుడైన సజ్జల భార్గవరెడ్డి వైసీపీ సోషల్ మీడియాను నడిపిస్తున్నాడు. జగన్ వ్యతిరేక నేతలపై తప్పుడు పోస్టులు పెట్టడంలో భార్గవరెడ్డే కీలకమని వర్రా రవీంద్రారెడ్డి రిమాండ్ రిపోర్టు ద్వారా వెల్లడైంది. భార్గవరెడ్డిపై ఇప్పటికే ఏపీలో పలు కేసులు ఉన్నాయి. ఇప్పుడు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో అతడి చుట్టూ ఉచ్చు మరింతగా బిగుస్తోంది. ఈ నేపథ్యంలోనే, అతడు తప్పించుకుని పోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేశారు.

# ప్రియాంక గాంధీపై ఈసీకి ఫిర్యాదు చేసిన ఎల్‌డీఎఫ్

- మొదటి పేజీ తరువాయి
అభ్యర్థి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరోపించింది.వయనాడ్ లోక్ సభ నియోజకవర్గ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా నవంబర్ 10న ప్రియాంకాగాంధీ ఓ చర్చిలో ప్రార్థనలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను ఎల్‌డీఎఫ్ ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది. ఆ ఫొటోలు, వీడియోల్లో ప్రియాంకాగాంధీతో పాటు ఎమ్మెల్యే, కేరళ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధిఖీ, వయనాడ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎన్డీ అప్పచన్ ఉన్నారు.

# మీరేం మాట్లాడుతున్నారో నేను గమనిస్తున్నా

- మొదటి పేజీ తరువాయి
చేసుకోవాలని సూచించారు. "తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న శాసనసభ్యులందరిలో నేనే సీనియర్. ప్రతి రోజూ కొత్త విషయాలు నేర్చుకుంటాను. అసెంబ్లీ సమావేశాలను ప్రతి ఎమ్మెల్యే సీరియస్ గా తీసుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఇక, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ... ప్రశ్నోత్తరాలు, జీరో అవర్, స్వల్పకాలిక చర్చలు తదితర అంశాలపై ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రశ్నోత్తరాల్లో అవకాశం రాకపోతే... లఘు చర్చలు, జీరో అవర్ లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయత్నించడం ద్వారా నియోజకవర్గ సమస్యలకు పరిష్కారం చూపొచ్చని అన్నారు. ప్రతి ఒక్క ఎమ్మెల్యే అసెంబ్లీ నియమనిబంధనలు తెలుసుకోవాలని అయ్యన్న స్పష్టం చేశారు.

# సోషల్ మీడియాలో నాపై ప్రచారాన్ని జగన్ ప్రోత్సహించారు

- మొదటి పేజీ తరువాయి
జగన్ వద్దు అని చెప్పి ఉంటే ఆ ప్రచారం అప్పుడే ఆగిపోయి ఉండేదని అన్నారు. వైసీపీ సోషల్ మీడియా ఓ సైతాన్ ఆర్మీలా తయారైందని పేర్కొన్నారు. వాళ్లకు వ్యతిరేకంగా ఉండేవారిపై సోషల్ మీడియాలో దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలు రాజకీయాల్లో కొనసాగాలంటే భయపడే పరిస్థితి తెచ్చారని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పుడు పట్టుబడ్డ వాళ్లంతా విషనాగులేనని, ఆ సోషల్ మీడియా విషనాగులతో పాటు అనకొండను కూడా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని షర్మిల ఉద్ఘాటించారు. ఇక, అసెంబ్లీ సమావేశాలకు వెళ్లను అనడం జగన్ అహంకారానికి నిదర్శనం అని విమర్శించారు. జగన్ కు ఒకప్పుడు 151 స్థానాలు ఇచ్చిన ప్రజలు, ఇప్పుడు 11 స్థానాలకే పరిమితం చేశారని, జగన్ అక్రమాలు, అవినీతిని ప్రజలు గమనించారని షర్మిల వివరించారు. ప్రజల తీర్పుపై జగన్ కు గౌరవం ఉండాలని హితవు పలికారు. సభలో మైకు ఇవ్వలేదం టే, అది మీ స్వయంకృతాపరాధమే అని వ్యాఖ్యానించారు. వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజలు ఓట్లు వేసింది అసెంబ్లీకి వెళ్లడానికి కాదా? మరి ప్రజల ఓట్లతో గెలిచి అసెంబ్లీకి హాజరుకాకపోవడం అంటే ప్రజలను వెన్నుపోటు పొడిచినట్టు కాదా? అని షర్మిల విమర్శించారు. అసెంబ్లీకి గైర్హాజరవడం ద్వారా వైసీపీ ఎమ్మెల్యేల అజ్ఞానం ఏంటో బయటపడిందని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు, అసెంబ్లీకి వెళ్లబోమని చెప్పి ఓట్లు అడిగారా? అని నిలదీశారు. మీకు సత్తా లేకపోతే రాజీనామా చేయండి అంటూ డిమాండ్ చేశారు.

# ఏపీలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా

- మొదటి పేజీ తరువాయి
చిరంజీవిరావు కూడా ఏపీపీఎస్సీ చైర్ పర్సన్ ను కలిసి, మెయిన్స్ పరీక్షను మరికొన్ని రోజుల పాటు వాయిదా వేయాలని గ్రూప్-2 అభ్యర్థుల తరఫున కోరారు. అదనంగా మరో 30 రోజుల సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, పలువురు ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా ఏపీపీఎస్సీకి ఇదే తరహా విజ్ఞప్తులు చేశారు. ఈ నేపథ్యంలో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న ఏపీపీఎస్సీ చైర్ పర్సన్ అనురాధ గ్రూప్-2 మెయిన్స్ ను మరో తేదీకి వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈసారి గ్రూప్-2 ప్రిలిమ్స్ కు 4.04 లక్షల మంది హాజరుకాగా, 92 వేల మంది మెయిన్స్ కు అర్హత సాధించారు.

# వైసీపీ సోషల్ మీడియా గుట్టు బయటపెట్టిన వర్రా!

- మొదటి పేజీ తరువాయి
కీలకమైన వ్యక్తులు అని వర్రా వెల్లడించాడు. మొదట్లో వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వివేక్ రెడ్డి సూచనలతో పోస్టులు పెట్టామని, ఆ తర్వాత సజ్జల భార్గవరెడ్డి బాధ్యతలు అందుకున్నాక మరింతగా విజృంభించామని చెప్పాడు. వైసీపీకి వ్యతిరేకంగా టీవీ చానళ్లలో మాట్లాడే వాళ్లని తాము టార్గెట్ చేశామని... నేతలు వారి కుటుంబ సభ్యులపై పోస్టులు పెట్టామని వివరించాడు. గతేడాది సెప్టెంబరులో పవన్ కల్యాణ్, వారి పిల్లలపై పోస్టులు పెట్టినట్టు వర్రా అంగీకరించాడు. అయితే, ఆ పోస్టులు తొలగించాలని వెంకటాద్రి అనే వ్యక్తి వచ్చాడని, రూ.2 లక్షలు ఇస్తే ఆ పోస్టులు తొలగిస్తానని అతడిని డిమాండ్ చేసినట్టు తెలిపాడు. 2020 నుంచి ఐప్యాక్ టీమ్ ద్వారా కంటెంట్ వచ్చేదని, తాము ఫేస్ బుక్ లో పోస్టు చేసేవాళ్లమని తెలిపాడు. జగనే కావాలి, జగనన్న రావాలి యాప్ లోనూ పోస్టు చేసేవాళ్లమని పేర్కొన్నాడు. జడ్జిలకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టాలని సజ్జల భార్గవరెడ్డి ఒత్తిడి తెచ్చాడని వర్రా పేర్కొన్నాడు. గత ఏడాది నుంచి నా ఫేస్ బుక్ ఐడీతో భార్గవరెడ్డి పోస్టులు పెడుతున్నాడు అని వర్రా వెల్లడించాడు. వైఎస్ షర్మిల, విజయమ్మ, సునీతలపై అభ్యంతరకర పోస్టులు పెట్టాలని అవినాశ్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి తమకు సూచించడంతో పాటు, కంటెంట్ కూడా ఇచ్చేవాడని తెలిపాడు. ఆ పోస్టులు ఏ విధంగా ఉండాలన్నది అవినాశ్ రెడ్డి, రాఘవరెడ్డి చర్చించుకునేవాళ్లని వెల్లడించాడు. సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో అరెస్టయిన వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు కోర్టులో హాజరుపర్చగా... న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడం తెలిసిందే.

# మహారాష్ట్రలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం..

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 20న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయి. ఈ క్రమంలోనే బీజేపీ అధిష్ఠానం మహారాష్ట్ర ఎన్నికల్లో జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. తెలుగు వారు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ తో ప్రచారం చేయించనుంది. ఈ నెల 16, 17 తేదీల్లో పవన్ కల్యాణ్ మహారాష్ట్రలో వివిధ ప్రాంతాల్లో బీజేపీ కోసం ప్రచారం చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన విషయం తెలిసిందే. ఎన్డీయే కూటమిలో భాగమైన జనసేన.. ప్రస్తుతం మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీకి సహకరించనుంది. రెండు రోజుల పాటు ప్రచారం చేసేందుకు పవన్ కల్యాణ్ సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇందుకోసం బీజేపీ సీనియర్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# భారత్-పాకిస్థాన్ మధ్య మరో వివాదం... తీవ్ర ఆరోపణలు చేసిన పాక్ స్క్రాబుల్ ఆటగాళ్లు

### భారత్ వీసాలు ఇవ్వలేదంటున్న పాక్ స్క్రాబుల్ ప్లేయర్లు

### సగం మందికి పైగా ఆటగాళ్లకు వీసా తిరస్కరించారని మండిపాటు

### కారణం చెప్పకుండానే తిరస్కరించారని ఆరోపణ



వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో టీమిండియా పాల్గొనడంపై భారత్-పాకిస్థాన్ మధ్య సందిగ్ధత కొనసాగుతోంది. భద్రతా కారణాల రీత్యా ఆతిథ్య పాక్‌కు టీమిండియాను పంపించబోమని బీసీసీఐ.. రావాల్సిందేనని పీసీబీ వాదులాడుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య మరో వివాదం చెలరేగింది.
భారత్ వేదికగా ఇవాల్టితో (మంగళవారం) ముగిసిన ఆసియా కప్ యూత్ స్క్రాబుల్ ఛాంపియన్‌షిప్, ఢిల్లీ కప్‌లో పాల్గొనేందుకు తమకు వీసాలు ఇవ్వలేదని కొందరు పాకిస్థాన్ ఆటగాళ్లు ఆరోపించారు. రెండు నెలల ముందుగానే దరఖాస్తులు చేసుకున్నప్పటికీ తాత్సారం చేశారని చెబుతున్నారు. అయితే పాక్ జట్టుకు 12 వీసాలు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.పాకిస్థాన్ ఆటగాళ్లకు వీసాలు తిరస్కరించామంటూ వచ్చిన మీడియా కథనాలను చూశామని, నవంబర్ 7వ తేదీన 12 మంది పాక్ ఆటగాళ్లకు వీసాలు జారీ చేశామని అధికారులు పేర్కొన్నారు. సకాలంలోనే జారీ చేశామని అన్నారు. అయితే పాకిస్థాన్ జట్టులోని ఆటగాళ్లందరికీ వీసాలు జారీ చేయలేదని మరికొందరు అధికారులు చెబుతున్నారు. వీసా పొందిన ప్లేయర్లు కూడా చాలా ఆలస్యంగా ఆ వీసాలు అందుకున్నారని, దీంతో భారత్‌కు రాలేకపోయారని పేర్కొన్నారు.కాగా ఈ వ్యవహారంపై పాకిస్థాన్ స్క్రాబుల్ అసోసియేషన్ (పీఎస్ఏ) డైరెక్టర్ తారిక్ పర్వేజ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2022లో భారత్‌కు వచ్చి టోర్నీలో పాల్గొని గెలిచిన ఆటగాళ్లతో పాటు జట్టులోని సగం మంది ఆటగాళ్లకు వివరణ లేకుండానే వీసాలు తిరస్కరించారని అన్నారు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత క్రికెట్ జట్టు పాల్గొనడంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

# వికారాబాద్ కలెక్టర్‌పై దాడి కేసు... నిందితులకు రిమాండ్

- మొదటి పేజీ తరువాయి
సేకరణకు వెళ్లిన కలెక్టర్‌పై దాడి జరిగింది. ఈ కేసులో నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించిన పోలీసులు వారిని కొడంగల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. అనంతరం జడ్జి వారికి రిమాండ్ విధించారు.నిన్న మొత్తం 55 మంది రైతులను పరిగి పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. ఆ తర్వాత 39 మంది రైతులను విడుదల చేశారు. 16 మందిని మరింత లోతుగా విచారించి వైద్య పరీక్షలకు పంపించారు. ఇదిలా ఉండగా, ఈ దాడి ఘటనను తెలంగాణ పోలీస్ విభాగం తీవ్రంగా పరిగణిస్తోంది. అధికారులపై దాడి చేసిన వారితో పాటు గ్రామస్థులపై కూడా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సురేశ్‌ది బీఆర్ఎస్ పార్టీగా గుర్తించారు. మణికొండలో ఉండే అతను పక్కా ప్రణాళికతో లగచర్లకు వచ్చి... గ్రామస్థులను రెచ్చగొట్టినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

# సుప్రీంలో జగన్ అక్రమాస్తుల కేసు మరో ధర్మాసనానికి

- మొదటి పేజీ తరువాయి
దీంతో పాటు ఈ కేసు విచారణను హైదరాబాద్ నుంచి మరో రాష్ట్రానికి మార్చాలంటూ రఘురామకృష్ణరాజు మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. కాగా, సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినప్పటికీ సీబీఐ కేసుల్లో తీర్పు తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పు ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. దీనిపై సుప్రీంకోర్టులో ఈడీ పిటిషన్ దాఖలు చేసింది.జగన్ అక్రమాస్తుల కేసు మంగళవారం విచారణకు రాగా.. సీజేఐ బెంచ్ లోని జస్టిస్ సంజయ్ కుమార్ 'నాట్ బిఫోర్ మి' చెప్పారు. దీంతో కేసును సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా మరో ధర్మాసనానికి మార్చారు. గత విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కుమార్ నాట్ బిఫోర్ మి చెప్పినా పొరపాటున మంగళవారం మళ్లీ లిస్ట్ అయినట్లు సీజేఐ తెలిపారు. ఈ కేసును జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం డిసెంబర్ 2వ తేదీన విచారిస్తుందని తెలిపారు. ఎంపీ రఘురామ దాఖలు చేసిన రెండు పిటిషన్లనూ జస్టిస్ ఓకా ధర్మాసనమే విచారిస్తుందని చెప్పారు.

# కేశినేని చిన్నిపై అప్పుడే వ్యతిరేకతా?

**విజయవాడ, నవంబర్ 12, పెన్ పవర్:** రాష్ట్రం మొత్తం వైసీపీ గాలివీచినా 2019లో విజయవాడ లోక్‌సభ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంది .. 2014, 19 ఎన్నికల్లో కేశినేని నాని టీడీపీ ఎంపీగా గెలిచారు . రెండో సారి గెలిచినప్పుడు తన షార్ట్ టెంపర్‌తో పార్టీలో అందరికీ దూరమయ్యారు. తన తమ్ముడు కేశినేని చిన్నికి పార్టీలో ప్రాధాన్యత లభిస్తుందన్న కోపం.. మరోసారి తనకు టికెట్ దక్కదన్న అక్కసులో పార్టీపై తిరుగుబాటు చేసి .. హడావుడిగా తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లి జగన్ సమక్షంలో వైసీపీలో చేరిపోయారు. విజయవాడ ఎంపీగా వైసీపీకి సరైన అభ్యర్థి లేకపోవడంతో కేశినేని నానినే వారికి దిక్కయ్యారు..టీడీపీ నుంచి అనుకున్నట్లుగానే నాని తమ్ముడు కేశినేని చిన్ని టికెట్ దక్కించుకుని అన్నపై ఘన విజయం నమోదు చేశారు. దాంతో నాని రాజకీయ సన్యాసం ప్రకటించడంతో బెజవాడ పాలిటిక్స్‌లో ఆయన అధ్యయనం ముగిసింది. విజయవాడ తమ్ముళ్లు పార్టీకి కేశినేని నాని తలనొప్పి వదిలిందని ఆనందపడుతుంటే.. ఇప్పుడు ఎలాంటి రాజకీయ అనుభవం లేని కేశినేని చిన్ని వారికి తలనొప్పిగా తయారయ్యారంట.విజయవాడ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో టీడీపీనే గెలిచింది. ఇప్పుడు ఇదే పెద్ద సమస్యగా మారిందంట.. ఏడుగురు ఎమ్మెల్యేలతో ఎంపీ చిన్నికి ఏదో రకమైన వివాదం కొనసాగుతోందట. తాను ఎంపీనని వందల కోట్లు ఖర్చుపెట్టి మిమ్మల్ని గెలిపించుకొని, తాను గెలిచానని.. కాబట్టి తాను చెప్పిందే చేయాలని చిన్ని హుకుం జరీ చేశారంట. జగ్గయ్యపేట, నందిగామ తిరువూరు, మైలవరం నియోజకవర్గం నేతలతో ఇసుక విషయమై ఎంపీ అవలంభిస్తున్న వైఖరి వివాదాస్పదంగా తయారైంది.కేశినేని పేరుతో ఆ నియోజకవర్గాల్లో పెద్ద పెద్ద లారీలు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాయంట. ప్రతి లారీపై కేశినేని అని రాసి మరి ఇసుకను పక్క రాష్ట్రానికి తరలిస్తున్నారని.. కనీసం ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వకుండా వారితో కోఆర్డినేషన్ చేసుకోకుండా ఎంపీ చిన్ని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. దీంతో ఎమ్మెల్యేలు ఇటీవల అధినేతకి ఫిర్యాదు కూడా చేశారు.. దానిపై విచారణ జరిపించి మాట్లాడదామని చంద్రబాబు భరోసా ఇచ్చారంటున్నారు.ఎన్నికల ముగిసే వరకు చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరితో కలసి మెలసి తిరిగిన కేశినేని చిన్ని.. గెలిచిన తర్వాత ఒక కోటరిని ఏర్పాటు చేసుకొని దాంతో




లోక్‌సభ సెగ్మెంట్‌ని శాసించాలని చూస్తున్నారంట. కార్యకర్తలు, నేతలు ఆయన్ని కలవాలంటే కోటరీ పర్మిషన్ తీసుకోవాలంట.. తిరుపతి వెంకన్న దర్శనం అన్న అవుతుందేమో కానీ విజయవాడ ఎంపీ దర్శనం కావట్లేదని పార్లమెంటు పరిధిలోని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గెలిచే వరకు నేనే మీరు మీరే నేను అన్న చిన్ని.. గెలిచిన తర్వాత మాత్రం ఒక్కొక్క నియోజకవర్గానికి ఒక్కొక ఇన్చార్జిని.. వారందరినీ కోఆర్డినేట్ చేయడం కోసం పార్లమెంట్ ఆఫీసులో మరికొందరితో ఒక టీమ్‌ని ఏర్పాటు చేసి కార్యకర్తలకి అందుబాటులో లేకుండా పోయారంట. విజయవాడ నగరంలో మూడు అసెంబ్లీ స్థానాలు ఉండగా ఒకచోట బిజెపి గెలిచింది.

ఎన్నికల్లో గెలిచిన తర్వాత ముగ్గురు ఎమ్మెల్యేలతో ఆశించిన స్థాయిలో ఎంపీ కి సత్సంబంధాలు లేకుండా పోయాయి.. ఏ కార్యక్రమమైనా ఎవరికి వారే చేసుకుంటున్నారు.ఇటీవల జరిగిన మద్యం టెండర్ల విషయంలో ఎమ్మెల్యేలకు, ఎంపీకి మధ్య బేధాభిప్రాయాలు వచ్చినట్లు బెజవాడలో చర్చ నడుస్తుంది.. తనపై చంద్రబాబుకి లేనిపోని ఫిర్యాదులు చేశారని చిన్ని పై సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా తీవ్ర అసంతృప్తితో ఉన్నారంట. ఇటీవల బెజవాడ వరదల సమయంలో చిన్ని చెప్పిందాన్ని బేస్ చేసుకుని అధికారులు, ప్రజల సమక్షంలో ఉమాపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక వెస్ట్ బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరితో కూడా చిన్నికి సత్సంబంధాలు లేవంట .. సూపర్ సీనియర్ అవ్వడంతో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు తో మాత్రం అంతోఇంతో సయోధ్య కొనసాగిస్తున్నాంటున్నారు. 2019లో వైసిపి గాలిలో కూడా టీడీపీని గెలిపించుకున్న బెజవాడ పై పార్టీ పెద్దలు ఫోకస్ చేయాలని లేకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందులు తప్పవని కార్యకర్తలు అంటున్నారు. వైసీపీ కార్పొరేటర్ లని చేర్చుకునే విషయంలో నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరగకుండా ఎంపీ నేరుగా చేర్చుకున్నారంట. అదే విభేదాలన్నిటీ ప్రధాన కారణమన్న వాదన వినిపిస్తుంది. మరి ఈ జూనియర్ కేశినేని తలనొప్పిని టీడీపీ పెద్దలు ఎలా సరిచేస్తారో చూడాలి.

# పోసానికి చుట్టుముడుతున్న కేసులు

**రాజమండ్రి, నవంబర్ 12, పెన్ పవర్:** పోసాని కృష్ణమురళి.. సినిమాల్లో మల్టీ రోల్స్ పోషించి సక్సెస్ అయ్యారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్, హీరో, రైటర్, ప్రొడ్యూసర్, డైరెక్టర్ ఇలా విభిన్న రూల్స్‌లో తనని తాను నిరూపించుకున్నారు. ఇండస్ట్రీలో కెరీర్ కంఫర్టబుల్‌గా ఉన్న టైంలోనే ఆ కాంట్రావర్సీ నటుడుకి రాజకీయాలపై ప్రేమ పుట్టుకొచ్చింది . 2009 ఎన్నికల ముందు ప్రజారాజ్యంతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో మొట్టమొదట సారి ఎమ్మెల్యేగా కూడా పోటీ చేశారు. చిలకలూరిపేట పీఆర్పీ అభ్యర్థిగా పోటీ చేసి తనకు ఎలాంటి పొలిటికల్ ఇమేజ్ లేకపోయినా? చిరంజీవి పుణ్యాణ 14 వేల ఓట్లు మాత్రం దక్కించుకుని మూడోస్థానంతో సరిపెట్టుకున్నారువైసీపీ స్థాపన తరువాత పోసాని కృష్ణ .. జగన్ పంచకు చేరారు. జగన్ పాదయాత్రలోనూ పాల్గొన్నారు. అయితే జగన్ మాత్రం 2014 నుంచి 2024 వరకు ఏ ఎన్నికల్లోనూ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. అయినా 2019 ఎన్నికల సమయంలో జగన్ కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇండస్ట్రీలో మెంటల్ కృష్ణగా పేరున్న పోసాని నోటి దూకుడు నచ్చి తాను అధికారంలోకి వచ్చాక జగన్ ఏపీ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ హోదా కట్టబెట్టారు. ఇక అప్పటి నుంచి పోసాని నోటికి అడ్డు అదుపులేకుండా పోయిందన్న విమర్శలున్నాయివైసీపీ బూతు నేతల కంటే ఎక్కువగా చంద్రబాబు, పవన్‌లను టార్గెట్ చేశారు .. తాను కమ్మ సామాజికవర్గానికి చెందిన వాడినని చెప్పుకుంటూనే.. కులాన్ని కించపరిచేలా మాట్లాడం, చంద్రబాబు కులాని వాడుకుంటున్నారని విమర్శించడం ఆయనకే చెల్లింది. ఆ క్రమంలో విపరీతంగా బూతు ప్రయోగాలు కూడా చేసి తీవ్ర వివాదాల్లో చిక్కుకున్నారు.ఇక మెగా ఫ్యామిలీపై ఆయన విమర్శలకు హద్దుపొద్దూ లేదంటారు. ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ హోదాలో ఆయన జనసేన అధినేత పవన్ కల్యాణ్, మెగాస్టార్ చిరంజీవిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పవన్ కల్యాణ్ సభలకు వచ్చే జనం ఎవరూ ఓట్లు వేయరని.. పవన్ కల్యాణ్ ఓ మెంటల్ కేసని ప్రెస్ మీట్లు పెట్టి మరీ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. అసలు మెగా ఫ్యామిలీ పైసల కోసమే పార్టీలు పెట్టిందని తీవ్ర ఆరోపణలు గుప్పించారు.పవన్‌పై పోసాని చేసిన విమర్శలతో అప్పట్లో జనసైనికులు, వీర మహిళలు పలు కేసులు పెట్టారు. అయితే వైసీపీ అధికారంలో ఉండటంతో పోలీసులను వాటిని పట్టించుకోలేదు. అయితే వీర మహిళల పోరాటంతో రాజమండ్రి



వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2022లో ఆయన పైన పలు సెక్షన్ల కింద కేసు నమోదు అయింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన వీర మహిళ ఇందిర గతంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దాన్ని పోలీసులు పట్టించుకోకపోవడంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసినప్పటికీ పోలీసులు పోసానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పట్లో ఆ వ్యవహారం పెద్ద సంచలనంగా మారింది.కూటమి ప్రభుత్వం వచ్చాక అప్పటి దాకా నోటికి పనిచెప్పిన పలువురు వైసీపీ సీనియర్లు సైలెంట్ అయ్యారు. మెంటల్ కృష్ణ మాత్రం నోటి దూకుడు కంటిన్యూ చేస్తూనే ఉన్నారు. లడ్డూ వివాదం, డిక్లరేషన్ రగడ, జగన్ తిరుమల పర్యటన రద్దు తదితర అంశాలపై పోసాని కృష్ణమురళి అప్పట్లోతీవ్రంగా స్పందించారు. సీఎం చంద్రబాబు టార్గెట్ గా తీవ్ర వ్యాఖ్యలు చేశారు . అంతా కలిసి జగన్ ను ఎందుకు ఇంతలా హింసిస్తున్నారని పోసాని ప్రశ్నించారు. జగన్ తిరుమలకు వెళ్లకుండా అడ్డుకోవడం దారుణం అని బోల్డు ఆవేదన వ్యక్తం చేశారుపనిలోపనిగా జగన్ కు ప్రాణగండం ఉందని పోసాని సంచలన ఆరోపణలు చేశారు. దయచేసి జగన్ ను మాత్రం మర్డర్ చేయించమాకు, మీకు పెద్ద హిస్టరీ ఉంది నాకు తెలుసు.. అంటూ చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారాయన. ఎప్పుడు పోతామో ఎవరికి తెలుసు, అయినా భయపడేది లేదని హీరోయిజం ప్రదర్శించారు.రాష్ట్రంలో పొలిటికల్ సీన్ మారినా పోసాని మాత్రం దూకుడు తగ్గించడం లేదు. అదే ఆయన మెడకు చుట్టుకునేలా కనిపిస్తుందంటున్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ, జనసేన అధినేతల్ని ఇష్టమె?చ్చినట్లు తిట్టిన వారిపై పాత కేసులను పోలీసులు తిరగదోడుతున్నారు. వరుసగా అరెస్టులు కూడా జరుగుతున్నాయి. ఆధారాలతో కేసులు పెడితే చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారుల ప్రకటిస్తున్నారు. ఇటు పోసానిపై నోరు పారేసుకున్నందుకు ఇప్పటికే పెండింగ్ కేసులు ఉన్నాయి.ప్రాధాన్యతా క్రమంలో పోసాని పాతకేసు ఫైళ్లు ఎప్పుడైనా దుమ్ము దులపవచ్చంటున్నారు. ఇక ఓటమి తర్వాత కూడా ఆయన నోటికి పనిచెప్తుండటంతో కొత్త కేసులు నమోదైతే ఆయన పరిస్థితి ఏంటన్న చర్చ నడుస్తుంది. ఇప్పటికే మెగా ఫ్యామిలీపై అనుచిత వ్యాఖ్యలు చేసి ఇండస్ట్రీలో తీవ్ర వ్యతిరేకత తెచ్చుకున్న పోసాని మున్ముందు సిల్వర్‌స్క్రీన్‌పై కనిపిస్తారా? లేదా ? అన్నది డౌటే. ఇక పదిహేనేళ్ల రాజకీయ జీవితంతో ఏమన్న సాధించారా అంటే పదేళ్లు ఆయన నోటిని వాడుకున్న జగన్ కనీసం టికెట్ కూడా ఇవ్వలేదు. ఇక ఇప్పుడు కేసుల చట్రంలో ఇరుక్కుంటే మెంటల్ కృష్ణకి అండగా నిలిచేదెవరు?.. అదే ఇప్పుడు రెండు ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్ గా మారింది

# మాకెప్పుడు పదవులు


**విజయవాడ, నవంబర్ 12, పెన్ పవర్:** రెండు విడతల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీ అయిపోయింది. పోస్టులు ఈన్నీ ఫిలప్ అయిపోయాయి. ఇక అదృష్టం ఎప్పుడు తమ తలుపు తడుతుందోనని ఊహల్లో తేలియాడిపోతున్నారట. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నదెవరు.? ఎమ్మెల్సీ కోసమే పట్టుబడుతున్న లీడర్లు ఎవరు.?ప్రభుత్వం వచ్చింది హ్యాపీగా ఫీల్ అయ్యామ్. టంపింగ్ మెజార్టీతో గెలిచాం..జోష్ మీదున్నాం. కానీ మాకు పదవేది సార్. ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడ్డాం. మీడియాలో గొంతు చించుకుని అరిచాం. సీటు ఇవ్వలేమంటే అర్థం చేసుకున్నామ్. మాకెప్పుడు సార్ పదవి యోగం దక్కేది అంటూ..ఏపీలో టీడీపీ నేతలు వేయి కళ్లలతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో పెద్ద సంఖ్యలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేపట్టింది కూటమి సర్కార్. ఇందులో టీడీపీ నేతలకు పెద్ద సంఖ్యలోనే పదవులు వచ్చాయి. అయితే ఇంకా కొందరు నేతలకు మాత్రం పదవుల రేసులో వెయిటింగ్ తప్పడం లేదటరెండో లిస్ట్‌లో తమ పేరు ఉంటుందని చాలామంది నేతలు భావించారు. కానీ టీడీపీ అంటే టక్కున గుర్తొచ్చే నేతల పేర్లు రెండో జాబితా నామినేటెడ్ పోస్టుల లిస్ట్‌లో కనిపించలేదు. బుద్దా వెంకన్న, జలీల్ ఖాన్, పరిటాల శ్రీరామ్, ఏవీ సుబ్బారెడ్డి, పట్టాభి ఇలా చాలామంది నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. అయితే సెకండ్ లిస్ట్‌లో తమ పేరు లేకపోవడంతో నిరాశ చెందారట. ఇప్పటివరకు భర్తీ అయిన వాటిలో లోకల్ డెవలప్‌మెంట్ అథారిటీలు, చిన్న చిన్న కార్పొరేషన్ పదవులే ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా పెద్ద పోస్టులు ఖాళీగా ఉన్నాయని..కాకపోతే..చాలామంది నేతలు ఎమ్మెల్సీ పదవి ఆశిస్తుండటంతో..ఎవరికి ఏ పోస్ట్ ఇచ్చి సంతృప్తి పరచాలో అధిష్టానానికి అంతుచిక్కడం లేదంటున్నారు. సీట్లు త్యాగం చేసిన నేతలు కొందరు అయితే.. పార్టీ కోసం గత ఐదేళ్లు తీవ్రంగా కష్టపడిన లీడర్లు ఇంకొందరు ఉండటంతో..టీడీపీ అధినేతకు వడపోత కష్టంగా మారిందట.మాజీమంత్రి దేవినేని ఉమాతో పాటు..కాపు నేత వంగవీటి రాధా ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక పవన్ కల్యాణ్ కోసం సీటు త్యాగం చేసిన పిఠాపురం టీడీపీ ఇంచార్జ్ వర్మ కూడా ఎమ్మెల్సీ బెర్త్ కోసమే పట్టుబడుతున్నారట. బుద్దా వెంకన్నకు నామినేటెడ్ పోస్ట్ ఇచ్చేందుకు పార్టీ రెడీగా ఉన్నా..ఆయన మండలికి వెళ్లాలని మంకు పట్టుతో ఉన్నట్లు టాక్. ఇక మహాసేన రాజేశ్, మంతెన సత్యనారాయణ, బీద రవిచంద్ర, బీటెక్ రవి, ప్రభాకర్ చౌదరి ఇలా ఇంకో నలుగురైదుగురు నేతలు ఎమ్మెల్సీ పదవి అయితేనే తీసుకుంటామంటున్నారట.నామినేటెడ్ పోస్ట్ ఇస్తామంటే ఎమ్మెల్సీ కావాలంటారు. అంతమందికి ఎమ్మెల్సీలు ఎలా ఇవ్వగలుగుతాం అంటూ..నేతల తీరుపై చంద్రబాబు కాస్త అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే సెకండ్ లిస్ట్‌లో చెప్పుకోదగ్గ నేతల పేర్లు లేనట్లు చెబుతున్నారు. నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవుల రేసును తేల్చలేకే ఇన్నాళ్లు.. ఛైర్మన్ పదవుల భర్తీ ఆలస్యం అయిందని అంటున్నారు. త్వరలోనే ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్న నేతలతో మాట్లాడి వ్యవహారం కొలిక్కి తేవాలని బాబు భావిస్తున్నారట. మంచి నామినేటెడ్ పోస్ట్




ఇచ్చి సంతృప్తి పరచాలని..భవిష్యత్‌లో ఇంకా అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారట. ఇక నామినేటెడ్ పోస్టులు తీసుకోనంటున్న నేతలకు కూడా సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారట. అందరికీ ఎమ్మెల్సీలు ఇవ్వడం కుదరదని..మీ రాజకీయ భవిష్యత్‌కు నాది భరోసా అంటూ బాబు సర్దిచెప్పబోతున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అలా ఎమ్మెల్సీ పదవులపై నేతలకు క్లారిటీ ఇచ్చిన తర్వాత..ఇక పూర్తిస్థాయిలో నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపడతారని తెలుస్తోంది.

## సోషల్ మీడియా కేసులతో వైసీపీ కార్యకర్తల ఇబ్బందులు


**విజయవాడ, నవంబర్ 12, పెన్ పవర్:** ఏపీలో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు తీవ్ ఒత్తిడికి గురవుతున్నాయి.సోషల్ మీడియాలో వారు పెట్టిన పోస్టుల్లో మార్ఫింగ్‌లు, బూతులు ఉంటే ఎవర్నీ వదిలి పెట్టడం లేదు. కుటుంబాలను దూషిస్తూ ఐదేళ్ల పాటు వారు సేఫ్ గా ఉన్నారు.నిజానికి ఇలాంటి వారిలో అత్యధిక మంది ప్రభుత్వ డిజిటల్



కార్పొరేషన్ నుంచో.. మరో ప్రభుత్వ వ్యవస్థ నుంచో జీతాలు తీసుకుంటూ వచ్చారు. అలా జీతాలు తీసుకుంటూ అప్పట్లో పెట్టిన పోస్టులే ఇప్పుడు అరెస్టులకు కారణం అవుతున్నాయి. తెలుగుదేశం పార్టీ వైసీపీ సోషల్ మీడియాను వ్యవస్థీకృత మాఫియాగా చెబుతోంది. దేశ విదేశాల్లో ఉన్న వారికి డబ్బులు ఇచ్చి మరీ పోస్టులు పెట్టిస్తున్నారని అంటున్నారు. గతంలో న్యాయమూర్తులపై పోస్టులు పెట్టింది కూడా వీరేనని..అలాగే.. టీడీపీ, బీజేపీ, జనసేన అగ్రనేతలు.. వారి కుటుంబాలపై ఇష్టం వచ్చినట్లుగా కామెంట్లు చేసింది కూడా వీలైనని అంటున్నారు. ఫేక్ అకౌంట్లతో వస్తున్నారని వీరందరినీ ఇప్పుడు బయటకు తీశారు. కనీసం రెండువందల మందిని ఇప్పటి వరకూ అదుపులోకి తీసుకున్నారు. వీరి పోస్టులన్నీ అత్యంత జుగుప్సాకరంగా ఉండటంతో న్యాయస్థానాల్లోనూ ఊరట దక్కడం కష్టంగా మారింది. వైసీపీ సోషల్ మీడియా గీత దాటిపోయిందని కూటమి ప్రభుత్వం ముందే చెప్పింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అరెస్టులు చేయలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చాక.. నర్రా రవీంద్రారెడ్డి, ఇంటూరి రవికిరణ్ వంటి వాళ్లకు ఇన్ స్టంట్ ట్రీట్మెంట్ ఉంటుందని టీడీపీ క్యాడర్ అనుకున్నారు. కానీ వాళ్లకు కూడా నోటీసులు ఇచ్చి పంపేశారు. దీంతో టీడీపీ క్యాడర్ లో అసహనం కనిపించింది. నాలుగు నెలల పాటు ఇలాగే జరిగింది. ఇక తమకు అడ్డుఅదుపూ లేదనుకున్నారు. అందరూ బయటకు వచ్చారు. సరైన సమయం చూసి ఏపీ ప్రభుత్వం పంజా విసిరింది. అంటే ఒకరిద్దర్ని జైలుకు పంపి మిగతా వారికి వియ్ స్టాండ్ పోస్టులు వేసే అవకాశం ఇవ్వలేదు. అందర్నీ ఒకే సారి లోపలేస్తున్నారు. కొంత మందిపై పోక్సో చట్టం ప్రకారం కూడా కేసులు పెట్టే అవకాశాలు ఉన్నాయి. దీంతో వైసీపీ సోషల్ మీడియా ఒక్క సారిగా నిస్తేజంగా మారిపోయిన సూచనలు కనిపిస్తున్నాయి. కొంత మంది వైసీపీ కార్యకర్తలు సోషల్ మీడియా అకౌంట్లను డిలీట్ చేస్తున్నారు. ఎందుకైనా మంచిదని క్షమాపణల వీడియోలు పెడుతున్నరా?. శ్రీరెడ్డి అనే సోషల్ మీడియా కార్యకర్తతో పాటు కాదు పదుల సంఖ్యలో ఇలాంటి సారీ ప్రకటనలు కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా అరెస్టులపై లోకల్ ఇంచార్జులు అసలు పట్టించుకోవడం మానేశారు. ఫేక్ అకౌంట్లతో బూతులు మాట్లాడిన వారి కోసం ఎవరూ రావడం లేదు. చాలా మంది ఫేక్ పోస్టులతో వైసీపీ ఆఫీసు నుంచి వచ్చిన కంటెంట్ షేర్ చేసిన వారు ఇప్పుడు అవి చేసింది తామేనని బయటకు తెలియడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇంటి చుట్టుపక్కల వారు కూడా అసహ్యించుకునే పరిస్థితి కనిపిస్తోంది. వీరందరికి భరోసా ఇవ్వకపోతే పార్టీకి పని చేసేందుకు భయపడతారని క్యాడర్ అనుకుంటోంది.

## 18న టీటీడీ పాలక మండలి సమావేశం

**తిరుమల, నవంబర్ 12, పెన్ పవర్:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన పాలక మండలి తొలి సమావేశం ఈనెల 18న జరగనుంది. ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరగబోయే ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. అందుకు సంబంధించి అధికారులు కసరత్తు ప్రారంభించారు.ఈనెల 18న ఉదయం 10.15 గంటలకు తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ బోర్డు సమావేశం కానుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన దాదాపు ఐదు నెలల తరువాత ఏర్పడిన టీటీడీ బోర్డు తొలి సమావేశం కావడంతో..



ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలుస్తోంది.ఈ సమావేశం కోసం అధికారులు అజెండా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. తొలిసారి జరగనున్న కొత్త బోర్డు సమావేశంలో ప్రధానంగా కొనుగోళ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి తీర్మానాలను ప్రకటించనున్నారు. తిరుమల, తిరుపతిలో భక్తుల సౌకర్యార్థం తీసుకోవాల్సిన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంపై ఫోకస్ పెట్టనున్నారు. గత బోర్డు నిర్ణయాలపైనా చర్చించే అవకాశం ఉందని తెలిసింది.టీటీడీ ఛైర్మన్ హోదాలో బీఆర్ నాయుడికి టీటీడీ అందించే సదుపాయాలను ఆయన తిరస్కరించారు. గతంలో ఛైర్మన్లకు భిన్నంగా బీఆర్ నాయుడు వ్యవహరించారు. టీటీడీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బీఆర్ నాయుడు టీటీడీ అందించే వాహనాలు, వసతి సదుపాయాలను సున్నితంగా పక్కనపెట్టారు. తిరుమలలో ఉన్నన్ని రోజులు సొంత వాహనాలను వినియోగించడంతో పాటు సహచరులు, బంధువులు ఉన్న వసతి గదుల అద్దెలు, భోజనం ఖర్చులను ఆయనే భరించారు.ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి ప్రాధాన్యతని.. బీఆర్ నాయుడు ఇటీవలి అన్నారు. శ్రీవారి భక్తులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. తాను చిన్నప్పటి నుండే ప్రతి సంవత్సరం శ్రీవేంకటేశ్వర స్వామిని కాలినడకన వచ్చి దర్శించుకునేవాడినని, ప్రస్తుతం తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సేవ చేసుకునే అరుదైన అవకాశాన్ని శ్రీవారు ప్రసాదించడం పూర్వజన్మ సుకృతమన్నారు.తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నవంబరు 28 నుంచి డిసెంబరు 6 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో చివరిరోజున భక్తులు విశేషంగా విచ్చేసే పంచమి తీర్థానికి తిరుమల నుండి వచ్చే శ్రీవారి సారె ఊరేగింపు ట్రయల్ రన్ నిర్వహించారు. తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీలో వినాయక స్వామివారి ఆలయం నుండి శ్రీవారి సారె ఊరేగింపు ట్రయల్ రన్ మొదలైంది. అక్కడి నుండి ఏనుగుపై సారెను ఊరేగించారు.

## మండలికి వెళ్లి... అసెంబ్లీకి డుమ్మాతో... వైసీపీ సాధించేదేమిటీ

**నెల్లూరు, నవంబర్ 12, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎప్పుడూ రాంగ్ డెసిషన్ తీసుకుంటారు. సలహాదారులు ఎవ్వరో కానీ ఆయనకు పూర్తిగా రాజకీయం వంటబట్టలేదని అంటారు దగ్గర నుంచి చూసిన వాళ్లు. ఎందుకంటే కీలకమైన సమయంలో జగన్ పక్కకు తప్పుకోవడాన్ని అందరూ తప్పు పడుతున్నారు. ప్రధానమైన ప్రజలకు అవసరమైన బడ్జెట్ సమావేశాలను బహిష్కరించి జగన్ సాధించిందేమిటి? అన్న ప్రశ్నకు ఆయన వద్ద సమాధానం మాత్రం లేదు. తమకు మాట్లాడే అవకాశం ఎటూ ఇవ్వరు కాబట్టి ముందుగానే అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించి పెద్ద తప్పు చేశారని వైసీపీ నేతలే అభిప్రాయపడుతున్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వెళ్లి అక్కడ కేటాయింపులపై నిరసన తెలియజేసి బయటకు వచ్చినా సరిపోయేది కదా? అని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. వైసీపీకి వాకౌట్ అన్న ఒక ఆప్షన్ ఉందని జగన్ కు అసలు తెలుసా? అని ప్రశ్నిస్తున్నారు. తాను ముందుగానే ఊహించుకుని తనకు మాట్లాడే అవకాశం ఇవ్వరని తనకు తాను ముందుగా అంచనా వేసుకుని బహిష్కరిస్తానని ప్రకటించడం ఎంతవరకూ కరెక్ట్ అని వైసీపీ నేతలే ప్రశ్నిస్తున్నారు. మాట్లాడేందుకు సరైన అవకాశం ఇవ్వకపోతే అప్పుడే నిరసన తెలిపి అసెంబ్లీ నుంచి బయటకు వస్తే హుందాగా ఉండేదని, ముందుగానే సమావేశాలను బహిష్కరించడమేంటని కొందరు సోషల్ మీడియాలో జగన్ నిర్ణయాన్ని దుమ్మె?త్తిపోస్తున్నారు. ఒకవైపు శాసనమండలిలో జరిగే సమావేశాలకు హాజరవుతూ ఇటు అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటం వైసీపీ ద్వంద వైఖరికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. శాసనమండలిలో తమకు బలం ఉండటంతో సమావేశాలకు హాజరు కావడంతో పాటు బలం లేని చోటకు గైర్హాజరవ్వడం ఎందుకని? ఎక్కడైనా తమ వాయిస్ ను వినిపించేందుకు ప్రయత్నించాలని, ప్రజా సమస్యలపై గళమెత్తి చాటాలని, అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని జగన్ కు హితవు చెబుతున్నారు. కేవలం పదకొండు మంది సభ్యులున్నంత మాత్రాన ప్రతిపక్షంగా శాసనసభ గుర్తించకపోయినా... హాజరయి తమ గళం వినిపించి ఉంటే ప్రజలు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చి ఉండేవారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మొత్తం మీద జగన్ తీసుకున్న నిర్ణయం పార్టీలోనే వివాదానికి కారణమయిం

# 22 ఏళ్లకే సంచలనం.. సచిన్, కోహ్లీని వెనక్కి నెట్టిన ఆఫ్ఘనిస్తాన్ క్రికెటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్తాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ చిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ లో తనదైన ముద్ర వేస్తున్నాడు. ముఖ్యంగా వన్డేల్లో సూపర్ ఫామ్ తో అదరగొడుతున్నాడు. 46 మ్యాచ్ లకే ఏకంగా 8 సెంచరీలు బాదేశాడు. ఒక సెంచరీ కొట్టడం చాలా కష్టం. కానీ ఈ ఆఫ్ఘన్ ఓపెనర్ చాలా ఈజీగా కొట్టేస్తున్నాడు. సోమవారం (నవంబర్ 11) బంగ్లాదేశ్ తో జరిగిన మూడో వన్డేలో సెంచరీతో కదం తొక్కాడు. 121 బంతుల్లో 101 పరుగులు చేసి వన్డే కెరీర్ లో 8వ సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. గుర్బాజ్ ఇన్నింగ్స్ లో 7 సిక్సులు..5 ఫోర్లున్నాయి. గుర్బాజ్ సెంచరీతో ఆఫ్ఘనిస్తాన్ 2-1 తేడాతో బంగ్లాదేశ్ పై వన్డే సిరీస్ గెలుచుకుంది. ఈ క్రమంలో ఒక అరుదైన రికార్డ్ నెలకొల్పాడు. టీమిండియా దిగ్గజ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ రికార్డ్స్ ను బద్దలు కొట్టాడు. 22 సంవత్సరాల వయసులో వన్డే కెరీర్ లో అత్యధిక సెంచరీలు కొట్టిన రెండో ప్లేయర్ గా నిలిచాడు. సచిన్ టెండూల్కర్ (22 సంవత్సరాల 357 రోజులు), విరాట్ కోహ్లి (23 సంవత్సరాల 27 రోజులు), బాబర్ అజామ్ (23 సంవత్సరాల 280 రోజులు) లాంటి దిగ్గజాలను గుర్బాజ్ అధిగమించాడు.దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ క్వింటన్ డి కాక్ ఈ లిస్టులో అగ్ర స్థానంలో ఉన్నాడు. డికాక్ కు 22 సంవత్సరాల 312 రోజులు అవసరం కాగా.. గుర్భాజ్ కు 22 సంవత్సరాల 349 రోజులకు ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. సీనియర్ బ్యాటర్ మహ్మదుల్లా 98 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్తాన్ మరో 10 మిగిలి ఉండగానే 5 వికెట్లు కోల్పోయి ఛేజ్ చేసింది. గుర్భాజ్(101) సెంచరీకి తోడు ఓమార్జాయి (70) హాఫ్ సెంచరీతో రాణించాడు.

# ఆ ఇద్దరికీ నిరాశే.. పాకిస్థాన్ ప్లేయర్‌ను వరించిన ఐసీసీ అవార్డు

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ స్పిన్నర్ నోమన్ అలీకి ఐసీసీ అవార్డు లభించింది. ఇంగ్లండ్‌తో ఇటీవల ముగిసిన మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో ఈ పాక్ స్పిన్నర్ అసాధారణ ప్రదర్శన చేశాడు. అక్టోబర్ నెలలో అద్భుత ప్రదర్శన కనబర్చిన నోమన్ మంగళవారం (నవంబర్ 12) మెన్స్ పురుషుల విభాగంలో ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు గెలుచుకున్నాడు. దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసో రబడా, న్యూజిలాండ్ ఆల్ రౌండర్ సాంట్నర్ ఈ అవార్డుకు నామినేట్ అయినా నిరాశ తప్పలేదు. అక్టోబరులో పాకిస్థాన్ ఇంగ్లాండ్ తో మూడు టెస్టుల సిరీస్ ఆడింది. తొలి టెస్టులో స్థానం దక్కించుకొని నోమన్ అలీ చివరి రెండు టెస్టుల్లో అద్భుతంగా బౌలింగ్ చేశాడు. రెండు టెస్టుల్లో ఏకంగా 20 వికెట్లు తీశాడు. రెండో టెస్టులో 11 వికెట్లు పడగొట్టిన అతను.. చివరిదైన మూడో టెస్టులో 9 వికెట్లతో సత్తా చాటాడు. బౌలింగ్ తో పాటు బ్యాటింగ్ లోనూ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. నోమన్ అలీ సూపర్ బౌలింగ్ తో పాకిస్థాన్ టెస్ట్ సిరీస్ ను 2-1 తేడాతో గెలుచుకుంది. "ఐసిసి మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఇంగ్లండ్‌పై స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో పాకిస్తాన్ గెలవడానికి అత్యుత్తమ ప్రదర్శనను అందించడంలో నాకు సహాయం చేసిన నా సహచరులందరికీ చాలా కృతజ్ఞతలు". అని ఈ అవార్డు గెలుచుకున్న తర్వాత నోమన్ అలీ అన్నాడు. మహిళా విభాగంలో న్యూజిలాండ్ ఆల్ రౌండర్ మెలీ కెర్ అక్టోబర్ నెలకు గాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును కైవసం చేసుకుంది.




# ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ విజయం... అయినా పాకిస్థాన్ కోచ్ అసహనం... కారణమిదే!

## పాకిస్థాన్‌తో వన్డే సిరీస్ ను సీఏ పెద్దగా ప్రచారం చేయలేదన్న జాసన్ గిలెస్పీ

## ఈ విషయమై క్రికెట్ ఆస్ట్రేలియా తీరు పట్ల గిలెస్పీ ఆగ్రహం

## బోర్డర్-గవాస్కర్ సిరీస్‌కు సీఏ అధిక ప్రాధాన్యత ఇస్తోందని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌ను పాకిస్థాన్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. దాదాపు 22 ఏళ్ల తర్వాత కంగారూల గడ్డపై పాక్ వన్డే సిరీస్ గెలుచుకుంది. అయితే పాక్ జట్టు వైట్‌బాల్ కోచ్ జాసన్ గిలెస్పీ మాత్రం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. దీనికి కారణం పాకిస్థాన్‌తో వన్డే సిరీస్ ను సీఏ పెద్దగా ప్రచారం చేయకపోవడమే. ఈ విషయమై గిలెస్పీ క్రికెట్ ఆస్ట్రేలియా తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఆసీస్‌కు చెందిన ఓ వార్త పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన సీఏ తీరును ఎండగట్టాడు.పాక్ జట్టు ప్రదర్శన పట్ల తాను సంతోషంగా ఉన్నా... సీఏ ఈ సిరీస్‌కి సరైన గుర్తింపు ఇవ్వలేదన్నారు. ఆస్ట్రేలియా బోర్డు బోర్డర్-గవాస్కర్ సిరీస్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించాడు. అందుకే తమ సిరీస్ కు ఎలాంటి ప్రచారం జరగలేదని




గిలెస్పీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇక క్రికెట్ ప్రమోషన్స్‌లో 'ఫాక్స్' స్పోర్ట్స్ చానల్ అద్భుతమైన పాత్ర పోషిస్తుందని కితాబిచ్చారు. కానీ సీఏ ప్రాధాన్యత మారిందని ఆరోపించారు. ఫాక్స్ లో ఎక్కడా ఆసీస్-పాకిస్థాన్ వన్డే సిరీస్ కు ప్రాధాన్యత ఇచ్చినట్టు కనిపించలేదని విమర్శించారు. పాక్-ఆసీస్ సిరీస్‌కు అడ్వర్టయిజింగ్, ప్రచారం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్‌తో టెస్టు సిరీస్ కోసం కీలక ఆటగాళ్లయిన మిచెల్ స్టార్క్, మార్కస్ లబుషేన్, జోష్ హేజిల్‌వుడ్, స్టీవ్ స్మిత్‌తో పాటు సారథి ప్యాట్ కమ్మిన్స్ కు పెర్త్‌లో పాక్‌తో జరిగిన మ్యాచ్‌కు విశ్రాంతి ఇచ్చారని గిలెస్పీ చెప్పారు. కాగా, జాసన్ గిలెస్పీ ఆస్ట్రేలియాకు చెందిన మాజీ పేసర్ అనే విషయం తెలిసిందే.

# బాలయ్య హీరోయిన్ సొగసైన ప్రదర్శన



# పూజ బేబీ మాస్టర్ ప్లాన్ అదేనా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** అదేంటో చిత్రంగా బుట్ట బొమ్మ పూజా హెగ్డేకి చేతిలో సినిమాలు పెద్దగా లేకపోయినా సరే టీవీ ఆన్ చేస్తే చాలు అమ్మడు దర్శనమిస్తుంది. అదెలా సాధ్యం అనుకుంటున్నారా.. సినిమాల కన్నా అమ్మడు ఈమధ్య ఎక్కువగా వాణిజ్య ప్రకటనలల్లో కనిపిస్తుంది. పూజా హెగ్డే యాడ్స్ బాగా ట్రెండింగ్ లో ఉంటున్నాయి. ప్రస్తుతం అమ్మడు మజా, గార్నియర్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాడ్స్ చేస్తుంది. ఈ యాడ్స్ ద్వారా తన ఫ్యాన్స్ అండ్ ఫాలోవర్స్ ని అలరిస్తుంది పూజా హెగ్డే.తెలుగులో రాధే శ్యాం తర్వాత ఒక్కటంటే ఒక్క ఛాన్స్ కూడా అందుకోలేదు. గుంటూరు కారం నుంచి ఆమె ఎగ్జిట్ అవ్వడమే ఆమెకు శాపంగా మారింది. అదేంటో మొన్నటిదాకా తెలుగులో ప్రతి స్టార్ సినిమాలో పూజానే హీరోయిన్ అన్న రేంజ్ నుంచి అమ్మడికి ఒక్క సినిమా ఛాన్స్ కూడా ఇవ్వలేనంత విధంగా గ్రాఫ్ పడిపోయింది. ఐతే కెరీర్ పరంగా డీలా పడాల్సిన అవసరం లేదని భావిస్తున్న పూజా హెగ్డే వాణిజ్య ప్రకటనల ద్వారా ప్రేక్షకులను అలరిస్తుంది.సౌత్ లో టాప్ ప్లేస్ దాకా వెళ్లిన పూజా హెగ్డే బాలీవుడ్ లో కూడా లక్ కలిసి రాక ఇబ్బంది పడుతుంది. ప్రస్తుతం దేవ అనే సినిమా చేస్తున్న పూజా బేబ్ నెక్ట్స్ సినిమా ఛాన్స్ ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంది. పూజా హెగ్డే గ్లామర్ ట్రీట్ ని మిస్ అవుతున్న ఆడియన్స్ ఆమెను త్వరగా వెండితెర మీద చూడాలని ఆశిస్తున్నారు. పూజా ఫ్యాన్స్ మాత్రం ఆఫర్లు లేట్ గా వచ్చినా అమ్మడు మళ్లీ తిరిగి కంబ్యాక్ అందుకుంటుందని ఆశిస్తున్నారు.ప్రస్తుతం కోలీవుడ్ లో సూర్య సరసన ఒక సినిమా చేస్తున్న పూజా హెగ్డే ఆ సినిమాతో అక్కడ క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తుంది. సూర్య 44 మాత్రమే కాదు దళపతి విజయ్ నెక్ట్స్ సినిమాలో కూడా అమ్మడు లక్కీ ఛాన్స్ పట్టేసింది. మొత్తానికి తెలుగు పరిశ్రమ దూరం పెట్టినా సరే కోలీవుడ్ నుంచి పూజాకి వరుస అవకాశాలు వస్తున్నాయి.విజయ్ తో బీస్ట్ తర్వాత మళ్లీ జత కడుతున్న పూజా హెగ్డే సూర్య, విజయ్ సినిమాల మీద చాలా హోప్స్ పెట్టుకుంది. మొన్నటిదాకా టాలీవుడ్ లో టాప్ లేపిన అమ్మడు కోలీవుడ్ లో కూడా తన మేనియా కొనసాగిస్తుందేమో చూడాలి. ఐతే చేస్తున్న సినిమాల ఫలితాల మీదే ఆమె నెక్ట్స్ ఆఫర్లు డిపెండ్ అయ్యి ఉంటాయని చెప్పొచ్చు.

# సోనాల్ తన దీపావళి గ్లోను చూపిస్తుంది



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com